క్లుప్తంగా

ఘనంగా నారాయణతీర్థుల జయంతి



శంకరి కృష్ణన్ గాత్ర కచేరి

మద్దిలపాలెం: త్యాగరాజ ఆరాధన ట్రస్ట్ ఆధ్వర్యంలో మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో గురువారం నారాయణతీర్థుల 448వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. త్యాగరాజ ఆరాధన ట్రస్ట్, విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ప్రతినిధులు ఎం.ఎస్.ఎన్.రాజు, సుంకరి కృష్ణన్, పేర్ల బాలమురళీకృష్ణ, సోమశేఖర్‌లు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం ప్రముఖ శంకరి కృష్ణన్ ఆలపించిన కీర్తనలు అలరించాయి. ఈ కచేరికి సరస్వతుల పార్థివ్ వయోలిన్, ఎం.కామేష్ మృదంగ సహకారం అందించారు.

60 మందికి నేత్ర పరీక్షలు



పేదలకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతం పోలీస్ స్టేషన్ సమీపంలోని ఉర్వి విక్రమ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం వాసవి కంటి ఆస్పత్రి నిర్వాహకులు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 60 మంది పిల్లలు, వృద్ధులకు నేత్ర పరీక్షలు చేశారు. వారిలో 23 మందికి కళ్ల అద్దాలు అవసరమని గుర్తించారు. మరో 18 మందికి కంటి ఆపరేషన్ అవసరమని నిర్ధారించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి వైద్య సిబ్బంది రామచంద్ర, సాగర్, జ్యోతి ట్రస్ట్ ప్రతినిధులు జి.సావిత్రి, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆరిలోవ: ఆరిలోవ ఎస్ఎస్‌లో 11 కేవీ బాలాజీ నగర్ ఫీడర్, 11 కేవీ ఆరిలోవ ఫీడర్, 11 కేవీ హనుమంతవాక ఫీడర్ పరిధిలో విద్యుత్ నిర్వహణ పనుల నేపథ్యంలో శుక్రవారం పలు ప్రాంతాల్లో సరఫరాకు అంతరాయం కలగనుంది. ఆయా ఫీడర్ల పరిధిలోని శ్రీహరినగర్, డ్రైవర్స్‌కాలనీ, ముస్తఫాకాలనీ, తోటగరువు, గాంధీ నగర్, బాలాజీనగర్, బీసీ కాలనీ, బీటీఆర్ నగర్, పార్వతీనగర్, పెదగదిలి, సిద్ధార్థనగర్, శాలిపేట, చినగదిలి, నేతాజీనగర్, దీన్‌దయాల్ పురం, వాణిజ్య పన్నుల విభాగం కార్యాలయం, తదితర ప్రాంతాలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీ ఈపీడీసీఎల్ జోన్-3 ఈఈ పి.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని కోరారు.

పాండురంగస్వామికి ప్రత్యేక పూజలు



స్వామికి పూజలు చేస్తున్న హనుమంతరావు

ఆరిలోవ: ఆషాఢ శుద్ధ తొలి ఏకాదశి సందర్భంగా పాండురంగాపురంలోని ఆలయంలో పాండురంగస్వామికి గురువారం ప్రత్యేక పూజలు చేశారు. పంచామృత అభిషేకం ఘనంగా నిర్వహించారు. వేద మంత్రాల మధ్య అర్చకులు సత్యనారాయణస్వామి వ్రతం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మట్టిపల్లి హనుమంతరావు, ఆలయ ఈవో ఎ.దేవుళ్లు, తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌లపై ఆక్రమణల తొలగింపు

ఎంవీపీ కాలనీ: వరాహ నృసింహస్వామి గిరిప్రదక్షిణకు ఇబ్బందులు తలెత్తకుండా జీవీఎంసీ చేపట్టిన ఫుట్‌పాత్‌లపై ఆక్రమణల తొలగింపు ఎంవీపీ కాలనీలో గురువారం కూడా కొనసాగింది. ఎంవీపీ కాలనీ, వెంకోజీపాలెం ప్రాంతాల్లో జీవీఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ సిబ్బంది ఫుట్‌పాత్‌పై, రహదారిని ఆనుకొని ఉన్న నిర్మాణాలను తొలగించారు. ఈ కార్యక్రమంలో పలువురు టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

8 రోజులు.. 2 బృందాలు

- జగనన్న సురక్ష నిర్వహణకు జోన్-3 సన్నద్ధం
- రేపటి నుంచి 19 వరకు విస్తృత సేవలు

ఎంవీపీ కాలనీ: ప్రజలకు సత్వరం సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహణకు జీవీఎంసీ జోన్-3 అధికారులు సన్నద్ధమయ్యారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా 11 రకాల సేవలను సులభతరంగా అందించేందుకు విస్తృత ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా వచ్చే నెల ఒకటి నుంచి 19వ తేదీ వరకు తూర్పు నియోజకవర్గం పరిధిలో 8 రోజుల పాటు 2 బృందాలు ఈ సేవలను అందించనున్నాయి. వివిధ సచివాలయాల పరిధిలో ఈ సేవలు అందుబాటులో ఉండనున్నాయి. మరోవైపు ప్రతి రోజు రెండు చోట్ల ఈ సేవలు అందించనున్నారు. జీవీఎంసీ జోన్-3 పరిధిలోని 14 వార్డుల్లో 73 సచివాలయాలు ఉండగా, 540 మంది సచివాలయ కార్యదర్శులు, 1512 మంది వలంటీర్లు ఉన్నారు. 8 రోజుల పాటు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో వారంతా భాగస్వాములై ప్రజలకు విలువైన సేవలు అందించనున్నారు.



ఎంవీపీ కాలనీలో సచివాలయ కార్యాలయం

ఏ రోజు.. ఎక్కడ?

8 రోజుల పాటు 14 వార్డుల్లోని 16 వేదికల ద్వారా జోన్-3 అధికారులు ఈ సేవలను అందిస్తుండగా.. జోన్ పరిధిలోని ప్రజలు ఏ వేదిక నుంచైనా ఈ సేవలను పొందే అవకాశం ఉంది.

- 1వ తేదీ 14వ వార్డు పరిధిలోని అల్లూరిసీతారామరాజు కూడలి దరి 110వ నంబర్ సచివాలయంలో, 22వ వార్డు కళాభారతి దరి 149 సచివాలయం ఈ సేవలు అందుబాటులో ఉండనున్నాయి.
- 4వ తేదీ 15వ వార్డు అల్లూరి సీతారామరాజు కూడలి దరి 109 సచివాలయంలో, 23 వార్డు ప్రియదర్శిని కాలనీ 117 సచివాలయంలో సేవలు అందించనున్నారు.
- 6వ తేదీ 16వ వార్డు శ్రామికనగర్ చాకలిపేట 114వ సచివాలయం, 24వ వార్డు వివేకానంద కల్యాణ మండపంలో సేవలు పొందవచ్చు.
- 10వ తేదీ 17వ వార్డు 104 సచివాలయం పరిధిలోని నేతాజీపార్కు, 25వ వార్డు 134 సచివాలయం పరిధిలోని రెల్లివీధి రాజేంద్రనగర్‌లో ఈ సేవలు అందుబాటులో ఉండనున్నాయి.
- 12వ తేదీ 18వ వార్డు ఎంవీపీ రైతుబజార్ దరి 99 సచివాలయంలోను, 26వ వార్డు లలితానగర్ 125వ సచివాలయంలోను సేవలు పొందవచ్చు.
- 14వ తేదీ 19వ వార్డు 153 సచివాలయం పరిధిలోని పెదజాలరిపేటలోను, 27వ వార్డు దొండపర్తి కల్యాణ మండపంలోను సేవలు పొందవచ్చు.
- 17వ తేదీ 20వ వార్డు పరిధిలోని రాణి చంద్రమదేవి ఆస్పత్రి దరి 155 సచివాలయంలోను, 22వ వార్డు పరిధిలోని కళాభారతి దరి 149 సచివాలయంలోను ఈ సేవలు అందుబాటులో ఉంటాయి.
- 19వ తేదీ 21వ వార్డు జీవీఎంసీ కల్యాణ మండపంలోను, 27వ వార్డు దొండపర్తి జీవీఎంసీ కల్యాణ మండపంలోను జగనన్న సురక్ష సేవలు అందించనున్నారు. ఎలాంటి రుసుం లేకుండా 11 రకాల సేవలను ప్రభుత్వం ఈ ప్రత్యేక సురక్ష క్యాంపుల ద్వారా త్వరితగతిన అందించనుంది.

ముగిసిన ముత్యమాంబ జాతర



పూజలు అందుకున్న ముత్యమాంబ అమ్మవారు



భక్తులకు ప్రసాదం అందిస్తున్న కార్పొరేటర్ సునీత

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు ఆరిలోవ శివాజీనగర్-2లో ముత్యామాంబ అమ్మవారి జాతర మహోత్సవాలు గురువారం ఘనంగా ముగిశాయి. రెండు రోజుల పాటు జరిగిన ఈ వేడుకల్లో భాగంగా అమ్మవారిని ఆరిలోవ కాలనీ, శివాజీనగర్, జేఎన్ఎన్ యూఆర్ఎం కాలనీ, శ్రీకాంత్‌నగర్, ఎస్‌కేఎంఎల్ నగర్, భగత్‌సింగ్‌నగర్ తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. చీరలు, పసుపు, కుంకుమ సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్పొరేటర్ కెల్ల సునీత అమ్మవారిని దర్శించుకుని, ఆలయ కమిటీ ఏర్పాటు చేసిన ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సాయంత్రం ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

మోదీ పాలనపై విస్తృత ప్రచారం



కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

ఎంవీపీ కాలనీ: గృహ సంపర్క్ అభియాన్‌లో భాగంగా ప్రధాని మోదీ 9 ఏళ్ల సుపరిపాలనపై బీజేపీ నాయకులు గురువారం కూడా ప్రచార కార్యక్రమం నిర్వహించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో ఆ పార్టీ నాయకులు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పార్టీ నగర అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర మాట్లాడుతూ మోదీ 9 ఏళ్లలో చేపట్టిన ప్రజారంజక పాలన, పథకాలపై విస్తృతంగా నగర వాసులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. దేశం ఆర్థికంగా బలోపేతమై ప్రపంచ అగ్రదేశాల సరసన నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దిలీప్‌వర్మ, జిల్లా ఉపాధ్యక్షుడు కాండ్రేగుల రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్



బక్రీద్ వేడుకల్లో పాల్గొన్న ముస్లింలు

ఆరిలోవ: బక్రీద్ పండగను గురువారం చినవాల్తేరు మొహమ్మదీయ మసీద్‌లో ముస్లింలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హిందువులకు స్వీట్స్, తేనెటీ పానీయాలు అందజేసి, ముస్లింలు సహోదర భావాన్ని చాటుకున్నారు. బక్రీద్ సందర్భంగా ఆధునీకరించిన ఖబ్రస్తాన్(శ్మశానం)ను అందుబాటులోకి తీసుకొని వచ్చారు. ఈ కార్యక్రమంలో మొహమ్మదీయ యూత్ ప్రెసిడెంట్ ఖాదర్ బాబా పాల్గొన్నారు.

సీఎం జగన్‌ను కలిసిన ఎమ్మెల్సీ కల్యాణి



విశాఖ విమానాశ్రయంలో బుధవారం ట్రాన్సిట్ హాల్ట్ చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్సీ వరుదు కల్యాణి

చిత్తశుద్ధితో పనిచేయండి

డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: రోగులకు చిత్తశుద్ధితో సేవలందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి. జగదీశ్వరరావు సూచించారు. పెందుర్తి మండల పరిధిలోని సరిపల్లి విలేజ్ హెల్త్ క్లినిక్, కుటుంబ డాక్టర్ విధానాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పీహెచ్‌సీ వైద్యులు,ఇతర ఆరోగ్య సిబ్బందితో సమీక్షించారు. ఏఎన్ఎం,ఆశ కార్యకర్తలు తమ పరిధిలోని హైరిస్క్ గర్భిణులను గుర్తించి వారిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపించాలని సూచించారు. వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించారు. గర్భిణులు,వ్యాధి నిరోధక టీకాలకు వచ్చే వారి వివరాలు యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. కుటుంబ డాక్టర్ విధానంలో భాగంగా సరిపల్లి హెల్త్ క్లినిక్‌ను సందర్శించి గ్రామ ప్రజలతో మాట్లాడారు. వైద్య సేవలపై ఆరా తీశారు.

ఎన్ఏడీ సీఈ ఎంప్లాయీస్ ఎన్నికల పోరు షురూ



సీఈ యూనియన్ ప్యానల్ సభ్యులు

గోపాలపట్నం: నేవల్ ఆర్మమెంట్ డిపోలో ఎన్నికల సందడి మొదలైంది. ఎన్ఏడీ సివిల్ ఎంప్లాయీస్ కోఆపరేటివ్ సొసైటీ పాలక మండలి కాల పరిమితి పూర్తి కావడంతో ఎన్నికల నగారా మోగింది. దీంతో ఎన్ఏడీ సీఈ యూనియన్, ఎన్ఏడబ్ల్యూ అండ్ ఎస్ యూనియన్ తలపడుతున్నాయి. అందులో ఎన్ఏడీ సీఈ యూనియన్ తన ప్యానల్‌ను ముందుగా ప్రకటించింది. కె. సూరి రెడ్డి, జి. ముత్యరాజు, టి. సంతోష్ కుమార్, వీటీఆర్ శ్రీను, కె. నారాయణరావు, డి. శివ, వి. సంతోష్‌కుమార్, కె. సూర్యనారాయణ పోటీలో ఉన్నారని సీఈ యూనియన్ నాయకులు చెబుతున్నారు. తమ సభ్యులను ఎన్నుకుంటే సొసైటీ సభ్యులకు 9 శాతం వడ్డీతో రుణాలు మంజూరు చేస్తామని హామీ ఇస్తున్నారు. సభ్యుల పిల్లలకు ఇన్సూరెన్స్, సొసైటీ సభ్యులకు ఇంటి స్థలం అందిస్తామంటూ హామీలతో ముందుకెళ్తున్నారు. ఈ ఎన్నికల్లో తమ ప్యానల్‌ను గెలిపించాలని కోరుతున్నారు.

తూర్పులో జేసీఎస్ ఇన్‌చార్జుల నియామకం

ఆరిలోవ: తూర్పు నియోజకవర్గం జేసీఎస్ ఇన్‌చార్జులను వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం గురువారం ప్రకటించింది. నియోజకవర్గంలో 10, 11, 12, 13 వార్డులకు జేసీఎస్(క్లస్టర్-1) ఇన్‌చార్జిగా బొండా ఉమామహేశ్వరరావు, 9, 17, 18, 19 వార్డులకు(సీ2)గా గరికిన నర్సింగరావు, 20, 21, 27, 28 వార్డులకు (సీ3)గా కోన కామేశ్వరరావు, 15, 16, 22, 23 వార్డులకు(సీ4)గా పులగం శ్రీనివాసరెడ్డిని నియమించారు.

‘ఉక్కు’ సంకల్పానికి కేంద్రం తలవంచాల్సిందే..



868వ రోజు ఉక్కు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ఉక్కు సంకల్పంతో నిర్విరామంగా కొనసాగుతున్న స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ ఉద్యమానికి కేంద్ర ప్రభుత్వం తలవంచక తప్పదని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 868వ రోజుకు చేరుకున్నాయి, ఈ దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారం అమ్మాలనే ఆలోచన వచ్చిన మోదీ ప్రభుత్వానికి ప్రజలు గట్టిగా బుద్ధి చెప్తారన్నారు. ఎందరో కార్మికుల బలిదానాలతో సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పడం దుర్మార్గమన్నారు. వెంటనే స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే కొనసాగుతుందనే ప్రకటనను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాలను ఉధృతం చేసేందుకు భవిష్యత్తు ప్రణాళికను సిద్ధం చేస్తున్నామన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన నిరంకుశత్వ నిర్ణయాన్ని వీడి ప్రైవేటీకరణను ఆపాలని కోరారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

గిరిప్రదక్షిణలో బాలలకు సౌకర్యాలు కల్పించండి



సింహగిరిపై సమీక్ష నిర్వహిస్తున్న సీతారామ్ తదితరులు

సింహాచలం: గిరిప్రదక్షిణతో పాటు ఆలయ ప్రదక్షిణ సమయంలో బాలలకు అన్ని సదుపాయాలు కల్పించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారామ్, కుమారి ఆదిలక్ష్మి సింహాచలం దేవస్థానం అధికారులకు సూచించారు. సింహగిరిపై గురువారం బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సారథ్యంలో దేవస్థానం అధికారులు, స్త్రీ,శిశు సంక్షేమశాఖ, కార్మికశాఖ, జిల్లా బాలల సంరక్షణ విభాగం, 1098 చైల్డ్‌లైన్, వార్డు సచివాలయాల కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. సీతారాం, ఆదిలక్ష్మి వచ్చే నెల 2న జరగనున్న గిరిప్రదక్షిణకు సంబంధించి దేవస్థానం అధికారులు చేస్తున్న ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. దారి పొడువునా పిల్లలకు వేడి పాలు, బిస్కెట్లు అందించాలే క్యాంపులు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో దేవదాయశాఖ డీసీ సుజాత, సింహాచలం దేవస్థానం ఈఈ శ్రీనివాసరాజు, ఏఈవోలు జంగం శ్రీనివాస్, భ్రమరాంబ, రమేష్‌బాబు, నరసింహరాజు, ఐసీడీఎస్ ప్రాజెక్ట్‌డైరెక్టర్ డి.వెంకటేశ్వరి, కార్మికశాఖాధికారి ఎస్.విజయశ్రీ, సీడీపీవోలు ఎం.వి.రమణ కుమార్తి, డి.నీలవేణి పాల్గొన్నారు.

ఘనంగా నిత్య కల్యాణం



జీలకర్రబెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో గురువారం శయన ఏకాదశి పూజలు(తొలి ఏకాదశి) పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అలాగే స్వామికి ఉదయం 9.30 గంటల నుంచి ఆలయ కల్యాణ మండపంలో నిత్యకల్యాణం ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

చందన అలంకరణలో శ్రీనివాసుడు



చందన అలంకరణలో బల్లిగిరి ప్రసన్నవేంకటేశ్వర స్వామి



ఆలయ మండపంలో విష్ణు సహస్ర నామాలు పారాయణం చేస్తున్న భక్తులు

- భక్తి శ్రద్ధలతో తొలి ఏకాదశి పూజలు
- బల్లిగిరికి పోటెత్తిన భక్తులు

అల్లిపురం: తొలి ఏకాదశి పర్వదినాన బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరాలయంలో స్వామి చందన అలంకరణలో నేత్రపర్వంగా దర్శనమిచ్చారు. స్వామిని దర్శించుకునేందుకు వేకువ జాము నుంచే భక్తులు ఆలయం వద్ద బారులు తీరారు. ఆలయ అర్చకుడు గొడవర్తి రాఘవాచార్యులు స్వామిని చందనంతో విశేషంగా అలంకరించి, భక్తులకు దర్శనాలు కల్పించారు. ఆలయ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను ఏర్పాటు చేసి భక్తుల గోత్రనామాలతో పూజలు చేశారు. భక్తులు స్వామికి పండ్లు, పుష్పాలు, పిండి పదార్థాలు నివేదించారు. విష్ణు సహస్ర నామ పారాయణం చేశారు. సాయంత్రం దేవస్థానం ఆవరణలోని ధ్వజ స్తంభం వద్ద మహిళలు ప్రత్యేకంగా దీపాలంకరణ చేశారు.

కట్టిపడేస్తున్న వైఎస్సార్ సీ వ్యూ అందాలు



కొండ అంచున వేసిన చిత్రాలు



ఐ లవ్ వైజాగ్ బోర్డు వద్ద ఫొటోలు తీసుకొంటున్న సందర్శకులు



పాత్ వే పై ఏర్పాటు చేసిన సోలార్ ట్రీ

ఆరిలోవ: నగరంలో పర్యాటక ప్రాంతాల్లో వైఎస్సార్ సీ వ్యూ పాయింట్ ప్రత్యేకత సంతరించుకుంటోంది. ఇక్కడ అందాలు, ఆహ్లాదకరం వాతావరణం పర్యాటకులను కట్టిపడేస్తున్నాయి. తెన్నేటి పార్కు నుంచి బీచ్‌రోడ్డులో సాగర్‌నగర్‌కు వెళ్లే దారిలో విశాలాక్షినగర్ సమీపం సీతకొండ మలుపు వద్ద ఈ వ్యూ పాయింట్‌ను మూడు నెలల క్రితం జీవీఎంసీ సుందరీకరించింది. జీ-20 సదస్సు కోసం జీవీఎంసీ అధికారులు ఇక్కడ సుమారు రూ.3 కోట్లు వెచ్చించి అభివృద్ధి చేశారు. అప్పటి వరకు అంతంతమాత్రంగా ఉన్న సీతకొండ బీచ్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది వైఎస్సార్ సీ వ్యూ పాయింట్‌గా నామకరణం చేశారు. అప్పటి నుంచి ఈ బీచ్ పాయింట్ వద్ద పర్యాటకుల సందడి ఎక్కువైంది. సుమారు 50 అడుగుల ఎత్తులో ఉన్న ఈ పాయింట్ వద్ద నుంచి సముద్రం వైపు చూస్తే ఎగసి పడుతున్న కెరటాలు, పడవలతో చేపల వేటకు వెలుతున్న మత్స్యకారులు, సముద్రానికి ఎదురుగా పచ్చని కొండ కనువిందు చేస్తున్నాయి. ఇక్కడ ఏర్పాటు చేసిన విద్యుత్ వెలుగులు సాయంత్రం సమయంలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. సీతకొండ అంచున రాళ్లపై రంగురంగుల పెయింటింగ్ వేశారు. బీచ్‌లో పెద్ద బండరాళ్లపై సముదర జీవుల చిత్రాలు గీశారు. ఇక్కడ రోడ్డును విస్తరించి విశాలమైన నడకదారి ఏర్పాటు చేశారు. సీ వ్యూ పాయింట్ వద్ద ఏర్పాటు చేసిన ఐ లవ్ వైజాగ్ బోర్డు వద్ద సందర్శకులు సెల్ఫీలు తీసుకుని ముచ్చటపడుతున్నారు. ఫుట్‌పాత్ మధ్యలో ఏర్పాటు చేసిన సోలార్ ట్రీ రాత్రి వేళ వెలుగులు విరజిమ్ముతూ మిరమిట్లుగొలుపుతోంది. దీంతో ఇక్కడ నిత్యం రద్దీగా ఉంటోంది.

సిరులతల్లికి ఘనంగా సహస్ర తులసీపూజ



సహస్ర తులసి పూజలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మికి గురువారం సహస్ర తులసీపూజ ఘనంగా నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు సత్యరూపవాణి, ఎం.ధనలత, సతీష్, ఎన్ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు క్షీరాభిషేక సేవ : కనక మహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.500 చెల్లిస్తే ఇద్దరిని అనుమతించనున్నారు. పూజలో పాల్గొనదలచే భక్తులు 0891 2566514, 2711725 లో సంప్రదించాలి.

ట్రిపుల్ ఆర్ సెంటర్లతో పర్యావరణ పరిరక్షణ



ట్రిపుల్ ఆర్ సెంటర్‌ను పరిశీలిస్తున్న సాయికాంత్ వర్మ

కొమ్మాది: రెడ్యూస్, రీయూజ్, రీ సైకిల్ (ట్రిపుల్ ఆర్) సెంటర్లు పర్యావరణ పరిరక్షణకు ఎంతో ఉపయోగపడతాయని జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ అన్నారు. గురువారం ఆయన తగరపువలస, ఎండాడ ప్రాంతాల్లో గల ఆర్ఆర్ఆర్ సెంటర్లను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ట్రిబుల్ ఆర్ సెంటర్ల ద్వారా ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. తక్కువ వినియోగం, పునర్వినియోగం, శుద్ధి చేసి వినియోగించడంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ కోసం ఈ సెంటర్లు ఎంతో ఉపయోగపడతాయని, వ్యర్థాల నిర్వహణకు స్థిరమైన అభివృద్ధికి బాటలు వేస్తాయని పేర్కొన్నారు. అనేక రకాల గాజు, కాగితం, మెటల్, ప్లాస్టిక్, టైర్లు, దుస్తులు, పుస్తకాలు, బ్యాటరీలు, ఎలక్ట్రానిక్ వ్యర్థాలను ఈ సెంటర్ ద్వారా సేకరించి రీ సైకిల్ చేసి ఆట వస్తువులతోపాటు నిత్య జీవితంలో వినియోగించే అనేక వస్తువులు తయారు చేయవచ్చన్నారు. అనంతరం తగరపువలసలో గల సబ్బివానిపాలెంలో బుక్ కేఫిని సందర్శించారు. పాఠులకు విజ్ఞానాన్ని అందించే పుస్తకాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. పర్యటనలో ఆయనతోపాటు అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, ప్రధాన వైద్యాధికారి నరేష్ కుమార్, పర్యవేక్షక ఇంజినీర్లు శామ్‌సన్ రాజు, సత్యనారాయణ రాజు, జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి పాల్గొన్నారు.